ఉచిత వైద్య శిబిరం

ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కొండాపూర్, ఫిబ్రవరి 25 : ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామాలతో మెరుగైన ఆరోగ్యం చేకూరుతుందని హోలిస్టిక్ దవాఖాన డాక్టర్ సద్గురు అన్నారు. ఆదివారం కొండాపూర్ శ్రీరామ్‌నగర్ కాలనీలోని శ్రీరామ హైస్కూల్‌లో హోలిస్టిక్ దవాఖాన సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దవాఖాన వైద్య బృందం కాలనీ వాసులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మెడిసిన్‌తోపాటు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వైద్య బృందం, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రసూననగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాంచందర్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 25 : జీడిమెట్ల డివిజన్ ప్రసూననగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ముప్పిడి రాంచందర్ ఎన్నికయ్యారు. ఆదివారం కాలనీలో జరిగిన ఎన్నికల్లో తన ప్రత్యర్థి అభ్యర్థి జి.రమేశ్‌పై నాలుగు ఓట్ల మెజార్టీతో రాంచందర్ గెలుపొందాడు. ప్రధాన కార్యదర్శిగా గుడి గోపాల్‌రెడ్డి, డి.సిద్ధులుగౌడ్ ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన కోదండ రామాలయం ఆలయం ఎన్నికల్లో అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా నాగచెంద్రారెడ్డి ఏగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను కాలనీవాసులు, స్థానికులు అభినందించి, కాలనీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేయాలని కోరారు.

కాముని నీటిని తోడేస్తున్న జలగలు

- యథేచ్ఛగా కొనసాగుతున్న నీటి దందా
- జోనల్ కమిషనర్ ఆదేశాలు బేఖాతర్
- కేసులు పెట్టినా ఆగని అక్రమాలు

అల్లాపూర్, ఫిబ్రవరి 25 : వేసవి కాలం ప్రారంభం కావడంతో నీటి అవసరాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఇండ్ల భవనాల్లోని నీటి వనరులు సరిపోక ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేస్తుంటారు. కానీ ఆ ట్యాంకర్ల నిర్వాహకులు ఆ నీటిని ఎక్కడి నుంచి తెస్తున్నారో ఎప్పుడు ఎవరూ గమనించరు.. దీనిని పట్టించుకోకుండా ఆ నీటిని వినియోగిస్తే అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉన్నది. ట్యాంకర్ల నిర్వాహకులు నీటిని నిల్వ ఉంచే ట్యాంక్ నిండా పాకురు పేరుకుపోయినా పట్టించుకోకుండా నీటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అల్లాపూర్ డివిజన్ 'కాముని చెరువు' పరిధిలోని ట్యాంకర్ల డ్రైవర్లు సైతం ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. కాముని చెరువును కేంద్రంగా మార్చుకుని అందులో నీటితో జోరుగా వ్యాపారం సాగిస్తున్నారు. అక్రమంగా కరెంటు మోటర్లు, పైపులను ఏర్పాటు చేసుకుని ఏకంగా వాల్టా చట్టానికే తూట్లు పొడుస్తున్నారు. కైత్లాపూర్ ఫ్లైఓవర్ నుంచి రాజీవ్‌గాంధీనగర్ వైపు వెళ్లేదారిలో కాముని చెరువులో ఈ నీటి దందా బాహాటంగా కొనసాగుతున్నది. ఇందుకోసం వారు కిలోమీటరు దూరంలో ఉన్న చెరువులోనే మోటర్లు పెట్టారు. అవి కనబడకుండా ఒడ్డును మట్టితో చదును చేశారు. ఈ వ్యాపారం రోజుకు సుమారు 40 నుంచి 50 ట్యాంకర్ల వరకు సాగుతున్నది. ఈ నీటిని ట్యాంకర్ల ద్వారా నగరంలోని పలు వాణిజ్య అవసరాలకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా నీటిని తోడేయడంతో.. స్థానికంగా ఉండే బస్తీవాసుల బోర్లలో నీరు అడుగంటిపోయి నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జోనల్ కమిషనర్ ఆదేశించినా ఆగని నీటి వ్యాపారం

ఇటీవల అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాముని చెరువు పరివాహక ప్రాంతాల్లో జోనల్ కమిషన్ వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులో బోర్లు వేసి మోటర్లతో తోడిన నీటిని తరలిస్తున్న ట్యాంకర్లను ఆపి తనిఖీ చేశారు. నీటిని నిలువ చేసే ట్యాంకర్.. ట్యాంక్ నిండా పేరుకుపోయిన పాకురు చూసిన జోనల్ కమిషనర్ నిర్వాహకుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతూ అక్రమంగా అపరిశుభ్రమైన నీటిని విక్రయిస్తున్న నిర్వాహకులపై వాల్టా యాక్ట్‌తో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని అల్లాపూర్ పోలీసులను జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదేశించారు.

ఈ మేరకు అక్రమ నీటి దందాకు పాల్పడుతున్న నిర్వాహకులపై కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ శ్రీపతి ఆంజనేయులు ట్యాంకర్లను సీజ్ చేశారు. ఈ క్రమంలో మూడురోజులు తాత్కాలికంగా బ్రేక్ పడినప్పటికీ.. మళ్లీ యథేచ్ఛగా నిర్వాహకులు తమ వ్యాపారం దర్జాగా మొదలు పెట్టారు. స్వయంగా జోనల్ కమిషనరే రంగంలో దిగి చర్యలు తీసుకున్నా.. మళ్లీ ఈ వ్యవహారం పునరావృతం కాకుండా చూడాల్సిన ఉన్నతాధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. దీనిపై కూకట్‌పల్లి ఎంఆర్‌వో స్వామిని ఫోన్‌లో వివరణ కోరగా.. చర్యలు తీసుకుంటామని సాఫీగా సమాధానం ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి నీటి అక్రమ దందాను అరికట్టి, ప్రజల ఆరోగ్యాలను కాపాడటంతోపాటు భూగర్భ జలాలను కాపాడాలని స్థానికులు కోరతున్నారు.

చెరువులో అమర్చిన మోటర్లతో పైపుల ద్వారా ట్యాంకర్లలోకి నీటిని నింపుతున్న నిర్వాహకులు

అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, ఫిబ్రవరి 25 : మారుతున్న జీవన శైలి నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. నిత్యం వ్యాయామాన్ని అలవాటుగా చేసుకోవడంతోపాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. హోలిస్టిక్ దవాఖాన ఆధ్వర్యంలో వివేకానందనగర్ డివిజన్ కమలాప్రసన్ననగర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ రోజాదేవితో కలిసి ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యాన్ని వాణిజ్య కోణంలో కాకుండా సేవా రూపంలో చూడాలన్నారు. ప్రైవేటు దవాఖానలు ఉచిత వైద్య సేవల నిర్వహణ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తుండటం అభినందనీయమని, ఇలాంటి సేవలను సహచర దవాఖానలు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ కోరారు. ప్రజల వద్దకే వచ్చి అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రంగారావు, సంజీవ రెడ్డి, భాస్కర్‌రావు, చంద్రకాంత్‌రావు, చంద్రశేఖర్, తిరుపతి, శంకర్, బండప్ప, వెంకటేశ్, డాక్టర్ శ్వేత, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలపై ఫిర్యాదు చేయండి

కొండాపూర్, ఫిబ్రవరి 25 : విద్యుత్ సరఫరాలో అంతరాయాలుంటే వెంటనే ఫిర్యాదు చేయాల్సిందిగా చందానగర్ వేమనరెడ్డి కాలనీ సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సమస్యలపై 9490153512/8985564919 నంబర్ల ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డిని కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్, ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2కు చెందిన పలువురు కార్యకర్తలు, నేతలు ఆదివారం బాచుపల్లి హిల్‌కౌంటీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారు. గోపాల్‌రెడ్డిని కలిసిన వారిలో వెంకటేశ్, మురళీ, శ్రీనివాస్, గణేశ్, గోల్కొండ శ్రీను, చంద్రమౌళి, మల్లేశ్ యాదవ్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

– దుండిగల్, ఫిబ్రవరి 25

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్ల మ్మ బండ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్ మసీదు సమీపంలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.17లక్షలతో రహదారి నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఎటువంటి సమస్యలు ప్రజలు తనను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శివరాజ్, మల్లేశ్, నర్సింహులు, నాగరాజు, ఉమేశ్, తదితరులు పాల్గొన్నారు.

– మియాపూర్, ఫిబ్రవరి 25

సంప్రదాయబద్ధంగా అట్టుకల్ పొంగల్

కూకట్‌పల్లి డివిజన్‌లోని దేవినగర్ (కేరళ కాలనీ)లో అట్టుకల్ పొంగల్ వేడుకలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. కేరళ రాష్ట్రంలో ప్రతియేటా ఈ మాసంలో అట్టుకల్ పొంగల్‌ను జరుపుకుంటారు. కాగా, ఆదివారం కాలనీలో నివసిస్తున్న మళయాలీలు పోచమ్మ ఆలయంలో అట్టుకల్ పొంగల్‌లో భాగంగా అరటిపండ్లు, బెల్లం, అన్నం, నెయ్యితో కూడిన ప్రసాదాన్ని తయారు చేశారు. అనంతరం ప్రసాదాన్ని స్వీకరించి సందడిగా పండుగ చేసుకున్నారు.

ఈ వేడుకల్లో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, కాలనీ అధ్యక్షుడు ఎంకే బాబు, నవోద్య, విజయ్‌కుమార్, మంగళన్, అప్పచెన్, మేఘ, రమేశ్, కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 25

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా పలువురు నృత్యకారుల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో అక్షద మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ గురువులు నిహాంత్రి రెడ్డి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలతో అలరించారు.

– కొండాపూర్, ఫిబ్రవరి 25

సందడిగా బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

మియాపూర్ గాయత్రీ బ్రాహ్మణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక సందడిగా సాగింది. మియాపూర్ జనప్రియా అపార్టుమెంట్స్ సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన ఈ వేదికలో మియాపూర్, చందానగర్, కూకట్‌పల్లి సహా నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ వధూవరులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేదిక ద్వారా 23కు పైగా వివాహాలు నిశ్చయమైనట్లు అసోసియేషన్ కీలక ప్రతినిధి పీఆర్‌కే మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి క్యాటరర్స్ అధినేత వైష్ణవి ప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధులు బెనారస్ బాబు, గొల్లపూడి రాజేశ్వర్‌రావు, మూర్తి, సోమయాజులు, రాంబాబు, శంకర శర్మ, రాఘవ, తిరుపతి శేషగిరి, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, రత్నకుమారి, భవానీ, శకుంతల, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

– మియాపూర్, ఫిబ్రవరి 25

హోమియో క్లినిక్ ప్రారంభం

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన అనంత హోమియో క్లినిక్‌ను ఆదివారం డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో వైద్యులు చంద్రశేఖర్, సుచరితలు తదితరులు పాల్గొన్నారు.

– కొండాపూర్, ఫిబ్రవరి 25

గ్రహణ మొర్రి చిన్నారులకు డ్రీమ్ అన్‌లిమిటెడ్ కార్యక్రమం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25 : గ్రహణ మొర్రి సమస్యలతో బాధపడే చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు బసవతారకం స్మైల్ ట్రైన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 'డ్రీమ్స్ అన్‌లిమిటెడ్' పేరుతో థియేటర్ వర్క్‌షాపు నిర్వహించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారుల్లో దాగిన ప్రతిభను వెలికి తీసేలా నాటికలు ప్రదర్శించారు. సరైన రీతిలో మాట్లాడటం, బాడీ లాంగ్వేజ్‌ను మెరుగుపర్చుకోవడం, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై నాలుగురోజుల పాటు శిక్షణ అందించామని స్మైల్ ట్రైన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా.డి.ముకుంద్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిజిత్ కొంపి, మమత కరోల్, అర్చనా సురేశ్, డా.కేవీ వీఎన్.రాజు పాల్గొన్నారు.

కులగణనతోనే బడుగులకు సముచిత న్యాయం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 25 : కులగణనపై అసెంబ్లీలో తీర్మానాన్ని ఆహ్వానిస్తున్నామని, బడుగులందరికీ సముచిత న్యాయం దక్కుతుందని వక్తలు పేర్కొన్నారు. ప్రజా తెలంగాణ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మేధావులు, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ కె.మురళీ మనోహర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏండ్లలో బీసీల లెక్కలు పూర్తి స్థాయిలో బయటకు రాలేదన్నారు.

నిత్యజీవితంలో 'గణితం'దే కీలకపాత్ర

- ట్రస్మా అడ్వైజర్ యాదగిరి శేఖర్‌రావు

విజేతలకు బహుమతులను అందిస్తున్న సంస్థ నీఈవో హరిచరణ్, ఎండీ సతీశ్‌బాబు, డైరెక్టర్ రవికుమార్

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 25 : నిత్యజీవితంలో గణితం(లెక్కలు) కీలకపాత్ర పోషిస్తుందని, పాఠశాల దశలోనే విద్యార్థుల్లో గణితం పట్ల ఆసక్తిని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీసుకోవాలని ట్రస్మా అడ్వైజర్ యాదగిరి శేఖర్ రావు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి పీఎన్ఎం పాఠశాల ఆవరణలో విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్స్ సంస్థ ఆధ్వర్యంలో అబాకస్ అండ్ వేదిక్ మ్యాథ్స్ స్టేట్ లెవల్ చాంపియన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రస్మా అడ్వైజర్ యాదగిరి శేఖర్‌రావు, విశ్వం ఎడ్యుటెక్ వ్యవస్థాపకులు పీపీఆర్ ప్రసాద్, నీఈవో హరిచరణ్, ఎండీ సతీశ్ బాబు, డైరెక్టర్ రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌తో విద్యార్థుల్లో గణిత సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. పాఠశాలలో అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌ల్లో మెలకువలు నేర్పించడం ద్వారా సులభంగా గణిత పరీక్షల్లో విజయం సాధిస్తారని, తద్వారా అన్ని అంశాల్లో చురుకుగా ఉంటారని తెలిపారు. నేటి సమాజంలో గణితం, ఇంగ్లిష్, కంప్యూటర్ సబ్జెక్ట్‌లో పరిజ్ఞానం ఉంటే.. ప్రపంచంలో ఎక్కడైనా అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థుల్లో ప్రత్యేక టాలెంట్‌ను ప్రోత్సహిస్తున్న సంస్థ నిర్వాహకులను, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 170 పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు, మహారాష్ట్రకు చెందిన 25 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులతోపాటు సర్టిఫికెట్లను అందజేశారు.అనంతరం చాంపియన్ ఇంగ్లిష్, కోడ్ ఛాంప్ పుస్కకాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం..

సమావేశంలో మాట్లాడుతున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్, ఫిబ్రవరి 25 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, 30వ డివిజన్ జర్నలిస్ట్స్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కరానికి తమవంతు కృషి చేస్తామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్) అన్నారు. కాంగ్రెస్‌పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొలన్ హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు.. జర్నలిస్ట్స్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అంతకు ముందు వారు కాలనీలోని పలు వీధుల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వారు బాచుపల్లిలోని కాసాని కౌసల్యకాలనీలో పర్యటించారు.

కేఎస్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్) ఆధ్వర్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నేతలు ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కాలనీకి చెందిన వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు కేఎస్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2కు చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి కంటి చికిత్సకు సహకరిస్తానని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

క్రీడల్లో పాల్గొన్న ఉద్యోగులు

వ్యవసాయ యూనివర్సిటీ : క్రీడలు మనిషికి ఎంతో ఉల్లాసాన్ని, ఉత్తేజాన్నిస్తాయని డీన్‌ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్ జెల్లా సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు పని వత్తిడిలో ఉంటారని, వీలైనంత వరకు వ్యాయామం, అప్పుడప్పుడు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. సాంస్కృతిక పోటీలు , సాహిత్యం తదితర కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ నరేందర్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి

మేడ్చల్, ఫిబ్రవరి 25 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి సూచించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ట్రాఫిక్ నిబంధలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలకు ప్రధాన కారణం నిబంధనలు పాటించకపోవడం వల్లే అన్నారు. బైక్ నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ వాడాలని, త్రిపుల్ రైడింగ్ చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహా రెడ్డి, సీఐ నాగేశ్వర్‌రావు, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 25 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి.

టమాట 13, వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 32, కాకరకాయ 48, బీరకాయ 40, క్యాబేజి 26, ఫ్రెంచ్ బీన్స్ 40, క్యారెట్ 25, కాలీఫ్లవర్ 18, దొండ 40, చిక్కుడు 50, గోరుచిక్కుడు 45, బీట్ రూట్ 25, క్యాప్సికం 55, ఆలుగడ్డ 23, కీరా 26, దోసకాయ 25, సొరకాయ 11, పొట్లకాయ (1) 18, కందగడ్డ 60, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 22, చింతకాయ 55, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 50, ముళ్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 18, గుమ్మడికాయ 23, నిమ్మకాయలు(12) 55 నుంచి 60, మునగకాయ(1) 8 నుంచి 10, పచ్చి బఠాని 51, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 140, వెల్లుల్లి 240, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.